సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



రోగులకు మెరుగైన వైద్యం
జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అందించే మెరుగైన వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. - 8లో



'నా మట్టి.. నా దేశానికి' యువత పయనం
'నా మటి నా దేశం' కార్యక్రమానికి జిల్లా నుంచి యువత వెళ్తున్న బస్సుకు జేసీ అశోక్ గురువారం జెండాఊపారు. - 8లో

నేడు గుమ్మలక్ష్మీపురంలో 'జగనన్నకు చెబుదాం'
గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం సాగుతుందని తహసీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలపై కలెక్టర్‌కు వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

సార్వత్రిక విద్యా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ
పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) 2023–24 విద్యా సంవత్సరానికి పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఓపెన్ స్కూల్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని దగ్గరలో గల ఓపెన్‌స్కూల్ సెంటర్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఫీజు చెల్లించి ప్రవేశాన్ని పొందవచ్చన్నారు. పదో తరగతి ప్రవేశం పొందే విద్యార్థులు ఆగస్టు 31 నాటికి 14 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. అడ్మిషన్లకు రికార్డు సీటు లేదా టీసీతో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, దివ్యాంగ విద్యార్థులు వైద్య ధ్రువీకరణ పత్రం ఇవ్వాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశం పొందాల్సిన విద్యార్థులు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

రీ-కౌంటింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం


డీఈఓ ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: డిప్లామా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) రెండో ఏడాది పరీక్ష ఫలితాల రీకౌంటింగ్‌కు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టులో నిర్వహించిన డిప్లామా రెండో ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు సుమారు 1808 మంది అభ్యర్థులు హాజరుకాగా, 1259 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మార్కుల డమ్మీ మెమోరాండం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్‌ఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చలానాను ఏపీ సీఎఫ్‌ఎంఎస్‌కు చెల్లించాలని, సొంత చిరునామా రాసిన ఎన్వలప్ కవర్, డమ్మీ మార్కుల మెమో నకలు దరఖాస్తుకు జత చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఆ రోజు సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని ఆ ప్రకటనలో సూచించారు.

జెడ్పీ సీఈఓగా పోలినాయుడు


పోలినాయుడు

గరుగుబిల్లి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ సీఈఓగా మరడాన పోలినాయుడు నియామకంపై ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, మాడుగుల మండలాల్లో ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు కార్యాలయంలో ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు. ఆయనను జెడ్పీసీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయనది గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్ర.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ లావణ్య
పాలకొండ: పాలకొండ రెవెన్యూ డివిజన్ అధికారిగా లావణ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన నూరుల్‌కమర్ టెక్కలికి బదిలీ కావడంతో అప్పటి నుంచి పార్వతీపురం ఆర్డీఓ హేమలత ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఆ స్థానంలో విజయనగరం వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న ఎం.లావణ్యను ఇక్కడకు ఆర్డీఓగా పదోన్నతిపై నియమించారు. ఆమె గురువారం పాలకొండ కోటదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విధుల్లో చేరారు. రెవెన్యూ పరమైన సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పార్వతీపురం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పాలకొండ ఆర్డీఓ ఎం.లావణ్యకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. పాలకొండ ఆర్డీఓగా బాధ్యతలను స్వీకరించిన లావణ్య కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను కలెక్టరేట్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక
కొత్తవలస: వచ్చేనెల 9,10 తేదీల్లో సీతారామరాజు జిల్లా అరకులో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్–14 విభాగంలో బాలబాలికల జట్లను ఎంపిక చేసేందుకు శుక్రవారం పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ కృష్ణంరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు సాగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని 11 నియోజకవర్గాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇందులో ప్రతిభ చూపినవారిని బాలుర జట్టుకు 12 మంది, బాలికల జట్టుకు 12 మందిని ఎంపిక చేస్తామన్నారు.

వలసల గడ్డపై.. సామాజిక విప్లవం

- నేడు గజపతినగరంలో తొలి 'సామాజిక సాధికారత బస్సు యాత్ర'
- హాజరుకానున్న ఉత్తరాంధ్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు
- సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు
- సంక్షేమాభివృద్ధిపై ప్రజలకు వివరించనున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 53 నెలల పాలన ఓ సామాజిక విప్లవం. రాష్ట్ర రాజకీయ చరిత్రలో మరో నవశకం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే గాక ప్రజలందరికీ ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ కార్యక్రమాల అమల్లో ఇదొక రికార్డు. నవరత్నాల్లాంటి పథకాల అమల్లోనే కాదు కరోనా మహమ్మారి పంజా విసిరినా అభివృద్ధిబాట తప్పని పాలన ప్రజల కళ్ల ముందు కనిపిస్తోంది. ఇలా పేదలకు న్యాయం చేయడం పెత్తందారులకు నచ్చట్లేదు. కడుపుమంటతో చేస్తున్న దుష్ప్రచారం కూడా ప్రజలకు చేటు చేసేదే! అందుకే వాస్తవమేమిటో తెలియజేయడానికి, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంతఃకరణశుద్ధితో చేస్తున్న పాలన ఫలితాలను వివరించడానికి వైఎస్సార్‌సీపీ వినూత్న కార్యక్రమానికి నాంది పలికింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో శుక్రవారం నిర్వహించనున్న తొలి 'సామాజిక సాధికారత బస్సుయాత్ర'కు గజపతినగరం వేదిక అవుతోంది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. పార్టీ రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి స్వయంగా విచ్చేసి పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ఇప్పటికే పలుమార్లు ఈ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రజలకు వివరించాలని...
'నేను విన్నాను... నేను ఉన్నాను' అంటూ 2019 సాధారణ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోను ఒక భగవద్గీతలా, ఒక బైబిల్‌లా, ఒక ఖురాన్‌లా పవిత్రంగా భావిస్తూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రమం తప్పక సంపూర్ణంగా అమలు చేస్తూ సంక్షేమ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆద్యుడయ్యారు. గతంలో మరే ప్రభుత్వమూ చేయనంతగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి సరికొత్త నిర్వచనం ఇచ్చారు. వారికి రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉంది. బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారం కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవన్నీ సామాజిక సాధికారత బస్సుయాత్రలో నాయకులు వివరించనున్నారు.

వారంటే ఎనలేని ప్రేమ...
నా బీసీ, నా ఎస్టీ, నా ఎస్సీ, నా మైనార్టీ సోదరులంటూ ప్రతి సందర్భంలోనూ చెప్పే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాల పట్ల ఎనలేని ప్రేమ చూపిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి మొదటి విడతలో ఉప ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారు. మంత్రివర్గ మార్పుల్లో ఆ పదవిని ఉమ్మడి విజయనగరం జిల్లాలోనే సాలూరు ఎమ్మెల్యే (ఎస్టీ) పీడిక రాజన్నదొరకు అప్పగించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన చీపురుపల్లి ఎమ్మెల్యే బొత్స సత్యనారాయణకు మంత్రివర్గంలో పెద్దపీట వేశారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గానూ కీలక బాధ్యతలు అప్పగించారు. పాలకొండ ఎమ్మెల్యే (ఎస్టీ) విశ్వాసరాయి కళావతికి శాసనసభ కమిటీల్లో కీలక పదవి కల్పించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కంబాల జోగులు రాజాం నుంచి, అలజంగి జోగారావు పార్వతీపురం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన బొత్స అప్పలనర్సయ్య (గజపతినగరం), శంబంగి వెంకట చిన అప్పలనాయుడు (బొబ్బిలి), బడ్డుకొండ అప్పలనాయుడు (నెల్లిమర్ల), కడుబండి శ్రీనివాసరావు (శృంగవరపుకోట) శాసనసభ్యులుగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. స్థానికసంస్థల్లోనూ 80 నుంచి 90 శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వర్గాలకు చెందిన వారికే వైఎస్సార్‌సీపీ కేటాయించింది. కీలకమైన జెడ్పీ చైర్మన్ పదవిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మజ్జి శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఆయనే చూస్తున్నారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో...	
జిల్లా పరిషత్తులో చోటు ఇలా...	
మొత్తం జెడ్పీటీసీ స్థానాలు	34
బీసీలకు కేటాయించినవి	25
ఎస్సీలకు కేటాయించినవి	5
ఎస్టీలకు కేటాయించినవి	4
సామాజిక వర్గాల కార్పొరేషన్‌ల రాష్ట్ర చైర్మన్‌లు	
బీసీలకు కేటాయించినవి	6
ఎస్సీలకు కేటాయించినవి	1
ఎస్టీలకు కేటాయించినవి	1
వివిధ కార్పొరేషన్‌ల రాష్ట్ర డైరెక్టర్‌లు పదవుల ఇలా...	
బీసీలకు కేటాయించినవి	63
ఎస్సీలకు కేటాయించినవి	4
ఎస్టీలకు కేటాయించినవి	2
మైనార్టీలకు కేటాయించినవి	2

విజయనగరం కార్పొరేషన్‌తో పాటు మునిసిపాలిటీల్లో మేయర్/చైర్మన్ పదవులు...	
బీసీలు	4
ఎస్సీలు	1
డిప్యూటీ మేయర్/ వైస్‌చైర్మన్ పదవి పొందిన బీసీలు	ఏడుగురు
విజయనగరం కార్పొరేషన్‌తో పాటు పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీల్లో వార్డు మెంబర్‌లుగా పదవులు పొందిన వారు..	
బీసీలు	114
ఎస్సీలు	21
ఎస్టీలు	6
మేజర్ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లుగా పదవులు పొందిన వారు	
ఎస్సీలు	12

టీడీపీలో అగ్రవర్ణాలదే ఆధిపత్యం
బీసీలు, ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలు ఎక్కువగా ఉండే ఉమ్మడి విజయనగరం జిల్లాలో టీడీపీ పగ్గాలు ఇప్పటికీ అగ్రవర్ణాల వారి చేతిలోనే ఉన్నాయి. పూసపాటి అశోక్ గజపతిరాజు కనుసన్నల్లోనే ఇప్పటికీ ఆ పార్టీ నడుస్తోంది. తమది బీసీల పార్టీ, బీసీలు తమకు వెన్నుముక అంటూ అరచేతిలో వైకుంఠం చూపించే చంద్రబాబు సైతం తన హయాంలో అగ్రవర్ణాలకే పదవులు కట్టబెట్టారు. అశోక్‌గజపతిరాజుకు కేంద్ర మంత్రి పదవి ఇప్పించారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన బొబ్బిలి రాజు సుజయ్‌కృష్ణ రంగారావును టీడీపీలోకి లాక్కొని తమ మంత్రివర్గంలో చోటు ఇచ్చారు. ఆ పార్టీకి 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా అబద్దాలతో నెట్టుకురావాలనే తాపత్రయం టీడీపీ నాయకుల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

ముఖ్యమైన నామినేటెడ్ పోస్టులు...			
పేరు	సామాజికవర్గం	కులం	పదవి/హోదా
మజ్జి శ్రీనివాసరావు (విజయనగరం)	బీసీ	తూర్పుకాపు	జిల్లా పరిషత్ చైర్మన్
మరిశర్ల బాపూజీనాయుడు (గరుగుబిల్లి)	బీసీ	కొప్పలవెలమ	జిల్లా పరిషత్ వైస్ చైర్మన్
కొ్రజన్ని సింహాచలం (పాచిపెంట)	ఎస్టీ	–	జిల్లా పరిషత్ వైస్ చైర్మన్
గదల బంగారమ్మ (నెల్లిమర్ల)	బీసీ	తూర్పుకాపు	ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ బోర్డ్ చైర్‌పర్సన్
వంగపండు ఉష (విజయనగరం)	బీసీ	కొప్పల వెలమ	ఏపీ క్రియేటివ్, కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్
డాక్టర్ అవనాపు భావన (విజయనగరం)	బీసీ	నాగవంశం	డీసీఎంఎస్ చైర్‌పర్సన్
వేచలపు వెంకట చినరామునాయుడు (శంగవరపుకోట)	బీసీ	కొప్పలవెలమ	డీసీసీబీ చైర్మన్
శోభా స్వాతీరాణి (శంగవరపుకోట)	ఎస్టీ	భగత	జీసీసీ చైర్‌పర్సన్
రెడ్డి పద్మావతి (సాలూరు)	బీసీ	కొప్పలవెలమ	జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్
జమ్మాన ప్రసన్నకుమార్(పార్వతీపురం)	ఎస్సీ	మాల	ఏపీ టిడ్కో చైర్మన్
మామిడి శ్రీకాంత్ (పార్వతీపురం మన్యం)	బీసీ	తూర్పుకాపు	తూర్పుకాపు/ గాజులకాపు కార్పొరేషన్
నెక్కల నాయుడుబాబు (శంగవరపుకోట)	బీసీ	కొప్పలవెలమ	కొప్పలవెలమ కార్పొరేషన్
డాక్టర్ ఆర్.రమాదేవి (పార్వతీపురం మన్యం)	బీసీ	దాసరి	దాసరి కార్పొరేషన్

ప్రజలకు వైద్య వరం



సాలూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరంలో ఓపీ వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

సాలూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ప్రభుత్వం వైద్యవరాన్ని అందిస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. సాలూరు మున్సిపాలిటీలోని 9వ సచివాలయం పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరంలోని కౌంటర్లు, రిజిస్ట్రేషన్లు, టోకెన్లు జారీచేసే విధానం, సిబ్బంది హాజరు, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాల్లో ప్రతిరోజూ 84 మంది ప్రత్యేక వైద్యనిపుణులు పాల్గొంటున్నారని తెలిపారు. వచ్చేనెల 10 తేదీవరకు శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కమిషనర్ జయరాం, వైద్యులు పాల్గొన్నారు.

కూర్మరాజుపేటలో...

మండలంలోని కూర్మరాజుపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల చెంతకే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవలను చేరువచేశారన్నారు. కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. ఎంపీడీఓ పార్వతి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయండి

మక్కువ: ప్రభుత్వం మంజూరు చేసిన భవనాలు, ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. మక్కువ మండలంలోని అభివృద్ధి పనులను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనసభద్రలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాన్ని చూశారు. నాణ్యతా ప్రమాణాలలో రాజీలేకుండా పనులు పూర్తిచేయాలన్నారు. నిర్మాణపనులు త్వరగా పూర్తిచేసి భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మక్కువ జగన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పనులను పరిశీలించి లబిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహంతో నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని సూచించారు. సిమెంట్, ఇసుక కొరత లేకుండా చూడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

జేఎన్‌టీయూ జీవీ క్లాస్-2 ఈసీ కమిటీ ఏర్పాటు
విజయనగరం అర్బన్: జేఎన్టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీకి క్లాస్–2 ఎగ్జిక్యూట్ కౌన్సిల్ (ఈసీ)ను ఉన్నత విద్యాశాఖ ఏర్పాటు చేసింది. కమిటీలో విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఉమెన్స్) కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అరుందతి, ఐతం విద్యాసంస్థల ఇండ్రస్ట్రియల్ రిలేషన్స్ హెడ్ డాక్టర్ బి.రాజేష్, గరివిడి ఫేకర్ సీఈఓ ఎం.సూర్య సుబ్రహ్మణ్యశర్మ, శివాణీ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ డి.వెంకటరావు, సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు సభ్యులుగా ఉన్నారు.

నేడు 'మీ వద్దకే పీఎఫ్'
విజయనగరం టౌన్: పీఎఫ్ ఖాతాదారులు, పెన్షనర్లు, పీఎఫ్ సంస్థల యజమానులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న మీ వద్దకే పీఎఫ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి పెదతాడివాడ మెర్సీమిషన్ స్కూల్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సవాల్లో ప్రథమ చికిత్స కేంద్రాల ఏర్పాటు
విజయనగరం ఫోర్ట్: పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం, విజయనగరం ఉత్సవాలు సందర్భంగా ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు పలుచోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేస్తామని డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆయా కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఒక్కో కేంద్రంలో షిఫ్టుల్లో ఒక వైద్యుడు, ఇద్దరు పారామెడికల్ సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. 29, 30వ తేదీల్లో అయోధ్యమైదానం, లయన్స్ కమ్యూనిటీహాల్, ఎం.ఆర్.లేడీస్ రిక్రియేషన్ క్లబ్, గురజాడ కళాభారతి, సంగీత కళాశాల, కోట, ఆనంద గజపతి ఆడిటోరియం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 29 నుంచి 31వ తేదీ వరకు బంకుల దిబ్బ, ట్యాంకు బండ్ రోడ్డులోని మాన్సాస్ గ్రౌండ్, రాజీవ్ స్టేడియం వద్ద, 30, 31వ తేదీల్లో రైల్వేస్టేషన్, కోట జంక్షన్, రాజారావుమేడ, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు.

ఆమోదం పేరుతో గిరిజనోత్పత్తుల మార్కెటింగ్
సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనోత్పత్తులను ఆమోదం బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో గిరిజన సహకార సంస్థ, వైకేపీ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాల్లో తయారుచేస్తున్న ఉత్పత్తుల వివరాలు తెలుసుకున్నారు. పసుపు, జీడి, అగరబత్తీలు, కొండ చీపుర్లు తదితర వస్తువులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిరిజనులు తయారు చేసే వస్తువుల ప్యాకేజీ వినియోగదారులను ఆకర్షించేలా ఉండాలన్నారు. వీటికి సంబంధించిన శిక్షణ ప్రత్యేకంగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రోషిరెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏపీడీ రమణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

ఊరూరా ఆరోగ్య సురక్ష శిబిరాలు



పార్వతీపురం మండలం కృష్ణపల్లిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ప్రజలకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం వైద్యశిబిరాలు నిర్వహిస్తోందని చెప్పారు. పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. పలువురు రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ప్రజలంతా వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వైద్యశిబిరాల నిర్వహణ ఇలా...	
పీహెచ్‌సీ	శిబిరం నిర్వహించే ప్రాంతం
పెదంకలాం	అజ్జాడ, జెడ్పీహెచ్‌ఎస్
కేఆర్‌బీ పురం	పెదశాఖ, పీహెచ్‌సీ ఉపకార్యాలయం
ఆర్‌ఆర్‌బీ పురం	కురుపాం, జెడ్పీహెచ్‌ఎస్
పెంబొండపల్లి	లక్ష్మీనారాయణపురం సచివాలయం
తోణాం	గంజాయిభద్ర సచివాలయం
బత్తిలి	పులిపుట్టి ఎంపీపీ పాఠశాల
సీతానగరం	ఆర్ పెంకంపేట జెడ్పీహెచ్‌ఎస్
జియమ్మవలస	ఎం.అల్లువాడ విలేజ్ క్లినిక్
వీరఘట్టం	వీరఘట్టం–4, పాఠశాల

జిల్లాలో గురువారం అందించిన వైద్యసేవల వివరాలు ఇలా..	
మండలాలు	15
వైద్యశిబిరాలు	11
మొత్తం ఓపీలు	4,824
స్పెషలిస్టుల ఓపీలు	1,691
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	2,941
డీఎం	513
హెచ్‌టీఎన్	628
ఏఎన్‌సీ	78
పీఎన్‌సీ	41
అనీమియా	87
ల్యాబ్‌టెస్టులు	2,805
ఈసీజీ పరీక్షలు	120
రిఫరల్ కేసులు	98

క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్యం

● కలెక్టర్ ఎ.నాగలక్ష్మి



బి.రాజేరులో రోగులకు మందుల కిట్లను అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

బొండపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, రిఫరల్ కేసులు ఆస్పత్రిలో చేరేలా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె గురువారం పరిశీలించారు. సేవలపై ఆరా తీశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 455 సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. మరో 100 సచివాలయాల పరిధిలో నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం నెలకున్న వర్షాభావ పరిస్థితులతో 2,600 ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయినట్టు గుర్తించామన్నారు. మరో వారం రోజుల్లో వర్షం కురవకపోతే 25 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలియజేశారన్నారు. అంతకు ముందు వైద్య శిబిరాన్ని ఎంపీపీ చల్లా చలంనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శంకరరావు, ఏఓ డి.వెంకటరమణ, సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు అరికట్టాలి

● ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి



కూనేరు చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి

కొమరాడ: ఒడిశా నుంచి సారా, మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒడిశా సరిహద్దులో ఉన్న కొమరాడ మండలంలోని కూనేరు చెక్‌పోస్టును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర రహదారిలో వచ్చిన ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించి నిషేధిత పదార్థాలు జిల్లాలోకి రాకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి మాదక ద్రవ్యాలు దొరికినా కచ్చితంగా కేసు నమోదులు చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల విజేతలతో సెట్విజ్ సీఈఓ రామగోపాల్

విజయనగరం: పైడితల్లమ్మవారి జాతర, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ మేరకు గురువారం విజయనగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు..విజ్జీ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 11 జట్లు హాజరయ్యాయి. రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు పోటీలను సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ ప్రారంభించారు. అలాగే ఒక్క రోజు పాటు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు సీఈఓ అభినందనలు తెలిపారు.

సిరిమాను రథాన్ని సిద్ధం చేస్తున్నాం..

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 31న నిర్వహించనున్న సిరిమానోత్సవానికి సంబంధించి సిరిమాను రథాన్ని సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం స్థానిక పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో పైడిమాంబ సేవా సంఘం, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది సిరిమాను ఊరేగింపు ఆలస్యం కావడానికి గల కారణాలపై సమీక్షించారు. ఈ ఏడాది ఊరేగింపు ఆలస్యం కాకుండా నిర్ణీత సమయానికల్లా రథాన్ని సిద్ధం చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం సిరిమాను తయారు చేసే వడ్రంగి ప్రతినిధులతో చర్చించారు. సిరిమానుతో పాటు రథాలు తిరిగే సమయంలో ఇతరులను అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖకు సూచించారు. సమావేశంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆర్‌జేసీ ఎంవీ సురేష్‌బాబు, ఆర్డీఓ సూర్యకళ, తహసీల్దార్ కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

బాలల సైన్స్ కాంగ్రెస్‌కు సమాయత్తం

● ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు

● నవంబర్ 8న జిల్లాస్థాయిలో నిర్వహణ



గత ఏడాది జాతీయస్థాయికి ఎంపికైన 'పంట వ్యర్థాల నుంచి ఎరువుల తయారీ' ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకుంటున్న జిల్లా విద్యార్థులు (ఫైల్)



ప్రాజెక్టుల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: బాల శాస్త్రవేత్తలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బాలలసైన్స్ కాంగ్రెస్‌ను ఏటా నిర్వహిస్తున్నారు. నిర్దిష్ట సమస్యలపై శాస్త్రీయ పరిశోధనలు చేపట్టేందుకు పిల్లలను ప్రోత్సహించే ప్రత్యేకమైన కార్యక్రమం ఇది. బాలల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. బాలలు నిత్య జీవితంలోని పరిస్థితులతో విజ్ఞానశాస్త్రాన్ని పరస్పరం అనుసంధానం చేయడం ద్వారా క్లిష్టమైన స్థానిక సమస్యలకు పరిష్కారం కనుక్కోవాల్సి ఉంటుంది. సామాజిక సమస్యలపై శాస్త్రీయంగా ఆలోచించడం, కారణాలను అన్వేషించడం, శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరించడానికి బాలలు ప్రయత్నించాల్సి ఉంటుంది. దానికి సంబంధించిన పరిశోధనల ద్వారా గ్రహించిన అంశాలను నివేదికలుగా తయారు చేసి ప్రాజెక్ట్ రిపోర్టును జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించాలి. బాల సైంటిస్టులు చేసే అత్యుత్తమ ప్రాజెక్టుల ప్రదర్శనకు జాతీయ సైన్స్ కాంగ్రెస్ వేదిక అవుతుంది. ఈ నేపథ్యంలో నవంబర్ 8న ఆప్‌కాస్ట్ నేతృత్వంలో జిల్లా స్థాయిలో ఈ ప్రదర్శనలు నిర్వహించేలా అధికార యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది.

వీరు అర్హులు..

10–17సంవత్సరాల బాలలకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహించి వారిలో ప్రతిభను వెలికితీస్తుంది. జాతీయ స్థాయిలో ఉత్తమమైన ప్రాజెక్ట్‌గా నిలిస్తే దానికి పేటెంట్ హక్కు లభిస్తుంది. ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులకు జాతీయస్థాయిలో రిజర్వేషన్, నగదు బహుమతి అందజేస్తారు.

ప్రాజెక్టులు చేయాల్సిన అంశం ఇదే..

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2023–24 జిల్లా స్థాయి పోటీలు నంబర్ 8వ తేదీన నిర్వహించనున్నారు.'ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' ఈ ఏడాది బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రధాన అంశం. దీనికి తోడు మీ పర్యావరణ వ్యవస్థను తెలుసుకోవాలి. ఆరోగ్యం పోషణ, శ్రేయస్సును పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, పర్యావరణ వ్యవస్థ ఆధారిత జీవన విధానం, ఆరోగ్య కోసం సాంకేతిక ఆవిష్కరణ వంటి ఐదు ఉప అంశాల్లో మాత్రమే బాలల ప్రాజెక్టులు రూపొందించాల్సి ఉంటుంది. ఈ విధంగా విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాజెక్టు నివేదికను సదరు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ లింక్‌లో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్టు రూపకల్పన ఇలా...

- బాలలు ఎంచుకున్న ఉప అంశానికి సంబంధించి గైడ్ టీచర్ సహాయంతో సర్వే, పరిశీలన, ప్రశ్నావళి, కేస్ స్టడీస్ ఆధారంగా ప్రాజెక్టులు చేపట్టి, రిపోర్టు తయారు చేయాల్సి ఉంటుంది.
- ప్రెజెంటేషన్ సమయంలో ప్రాజెక్ట్ రిపోర్ట్, లాగ్ బుక్, నాలుగు చార్టర్లు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.
- ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్ 6 నిమిషాలు, వైవా 2 నిమిషాలు ఉంటుంది.
- ప్రతి పాఠశాల నుంచి కనీసం ఒక ప్రాజెక్ట్ తప్పనిసరిగా ఉండాలి.
- ఒక పాఠశాల నుంచి ఎన్ని ప్రాజెక్టులు అయినా సమర్పించవచ్చు.
- 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు.

ఉత్తమమైనవిగా ఉండాలి



పరిశోధన చేసే దిశగా బాలలను సమాయత్తం చేయడమే సైన్స్ కాంగ్రెస్ లక్ష్యం. స్థానిక సమస్యలకు పరిష్కారం చూపేవిధంగా ఈ పరిశోధనలు ఉండాలి. శాస్త్రీయంగా పరిశోధనలు చేసి ప్రెజెంట్ చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయికి విద్యార్థులంతా సమాయత్తం కావాలి. ఈనెల 31 లోగా రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలి.

గిరడ లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం.

మార్గదర్శకులుగా ఉపాధ్యాయులుండాలి



విద్యార్థులు ప్రాజెక్టులు సిద్ధం చేయడంలో ప్రతి సైన్స్ ఉపాధ్యాయుడు మార్గదర్శకుడిగా ఉండాలి. ఆరోగ్యం సుస్థిరత కోసం పర్యావరణాన్ని అర్థం చేసుకోవడం అనే అంశంపై ఇచ్చిన ఐదు ఉప అంశాలపై విద్యార్థులతో పరిశోధనలు చేయించాలి.

పి.రామకృష్ణ, ఆప్కాస్ట్, జిల్లా కోఆర్డినేటర్, పార్వతీపురం మన్యం.

బాలలను సన్నద్ధం చేయాలి

పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలల సైన్స్ కాంగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాజెక్టులు సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించేలా చూడాలి. ఔత్సాహిక విద్యార్థులను జిల్లా స్థాయి ప్రదర్శనలకు సంసిద్ధం చేయాలి.



కె.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం

'నా మట్టి..నా దేశాని'కి యువత పయనం

● జెండా ఊపి బస్సును ప్రారంభించిన జేసీ మయూర్ అశోక్



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: మట్టికి ప్రమాణాలు, వీరులకు వందనాలు నినాదంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన 'నా మటి నా దేశం' కార్యక్రమానికి జిల్లా నుంచి యువత వెళ్తున్న బస్సును జేసీ మయూర్ అశోక్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీకి పయనమయ్యే ఈ కార్యక్రమం సెప్టెంబర్1న ప్రారంభం కాగా అక్టోబర్ 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి మండలం నుంచి మట్టి కలశాలను యువత తీసుకువెళ్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యువతలోని దేశభక్తిని జేసీ అభినందించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, ఎన్‌వైకే సిబ్బంది పాల్గొన్నారు.

అన్నివర్గాలకూ సమన్యాయమే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జ్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఈ మేరకు గురువారం వారు గజపతినగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశదిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభలో గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకే సామాజిక సాధికార యాత్ర చేపట్టినట్లు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో గ్రామస్వరాజ్యం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేడు తీసుకు వచ్చారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్క గజపతినగరం నియోజకవర్గానికే వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా రూ.1100 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. గతంలో తెలుగు దేశం పార్టీ దాచుకోవడం, దోచుకోవడం తప్ప ఇటువంటి సంక్షేమం, అభివృద్ధిని తీసుకువచ్చిందా? అని ప్రశ్నించారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాల నాయుడు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మేరుగ నాగార్జున, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి పేర్ని నాని, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీసుబ్బారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు (సురేష్‌బాబు), జెడ్పీటీసీ గారతవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కె.ఆదినారాయణ, రేగ గోవిందరావు, కె.సుబ్రహ్మణ్యం, పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



ఘటనా స్థలంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: నిత్యం ప్రమాదాలకు నెలవుగా మండలంలోని అట్టలి కూడలి మారింది. పాలకొండ వయా వీరఘట్టం, పార్వతీపురం-రాయగడకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో అట్టలి మలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం పాలకొండ నుంచి దాదాపు 340 వంటగ్యాస్ సిలిండర్లతో వీరఘట్టం వైపు వెళ్తున్న లారీ ఈ మలుపు వద్ద అదుపు తప్పి సమీప తోటల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడం, సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకకుండా తోటలో లారీ బోల్తా పడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవీ.కృష్ణారావు ఎస్సై బి.శివప్రసాద్, అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావులు ఘటనా స్థలానికి చేరుకుని వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, గ్రామ సర్పంచ్ కె.దాములుతో మాట్లాడి ప్రమాదంపై ఆరాతీశారు.

ముంబై ఘన విజయం

● ముగిసిన అండర్-19 మహిళల అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీ



ట్రోఫీతో ముంబై జట్టు

విజయనగరం: ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహించిన అండర్–19 మహిళల అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్లో ముంబై జట్టు ఘన విజయం సాధించింది. ఫైనల్స్‌లో ప్రత్యర్థి మహారాష్ట్ర జట్టుపై ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచిన ముంబై క్రీడాకారులు 8 వికెట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు 33.3 ఓవర్లలో 89 పరుగులకే 10 వికెట్లు నష్టపోయింది. ముంబై బౌలింగ్‌లో హర్లే గాలా 7 ఓవర్లలో 4 వికెట్లు, అశ్విని నిషాద్10 ఓవర్లలో 3 వికెట్లు, కాశిష్ 5 ఓవర్లలో 2 వికెట్లు దక్కించుకుని మహారాష్ట్ర బ్యాటర్‌లను ముప్పుతిప్పలు పెట్టారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ముంబై జట్టు కేవలం 17.2 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 92 పరుగులు జోడించి విజయం సాధించింది. జట్టు బ్యాటింగ్‌లో సానిక చాల్కే 43 పరుగులు, సాలోని 33 పరుగులతో రాణించారు. విజేతలకు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి, డీఎస్ఏ కార్యదర్శి రాజు, ఎంఎస్‌కుమార్, కిశోర్‌రాజు, సీతారామరాజులు ట్రోఫీలు ప్రదానం చేశారు.

పెదకోమటిపేటలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదానికి గురైన ఇల్లు

సాలూరు: పట్టణంలోని పెదకోమటిపేటలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ మేరకు అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదకోమటిపేటలో గల గాజుల వ్యాపారి బోడ ప్రసాద్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఆ సమయంలో ఇంటి వారెవరూ లేకపోయినప్పటికీ మంటలు వ్యాపించడం గమనించిన ఇరుగుపొరుగువారు అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్‌చేశారు. దీంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.25 వేలకుపైగా ఆస్తినష్టం వాటిల్లి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అండర్–19 బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

● 28 నుంచి మదనపల్లిలో రాష్ట్రస్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాల, బాలికల జట్లు

విజయనగరం: చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఈ నెల 29 నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు ఎంపిక పోటీలు గురువారం పూర్తయ్యాయి. ఈ మేరకు విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు హాజరుకాగా..జిల్లా అండర్–19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. అలాగే అండర్–19 జూడో పోటీలకుగాను జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు అనంతపురం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఇరు అంశాల్లో క్రీడాకారులు ఈనెల 27న ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రైల్వేస్టేషన్ వద్దకు హాజరుకావాలని సూచించారు. ఈ ఎంపిక పోటీలను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

30న హెటిరో ఫార్మాకంపెనీ జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: ఈనెల 30వ తేదీన స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాలలో హెటిరో ఫార్మాకంపెనీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలియజేశారు. ఐటీఐ(ఫిట్టర్), డిప్లమో (మెకానిక్), బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎంఎస్సీ(కెమిస్ట్రీ), బీకాం(కంప్యూటర్స్) ఉత్తీర్ణులైన వారు ఈ జాబ్‌మేళాకు అర్హులన్నారు. 27 సంవత్సరాలలోపు వయస్సు గల అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8019719234, 8074231274 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జాతీయ స్థాయి విజేతలకు డీఈఓ అభినందనలు



విజేతలను అభినందిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: జాతీయస్థాయిలో ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీల్లో విజేతలను డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం తన చాంబర్‌లో అభినందించారు. రాష్ట్ర జట్టుకు కబడీ పోటీల్లో తృతీయ స్థానం, ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం లభించిన విషయం తెలిసిందే. అయితే ఖోఖో రాష్ట్ర జట్టులో ఆడిన గంట్యాడ మండలం పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.లక్ష్మీప్రసన్న కుమార్, కబడీ రాష్ట్ర జట్టులో ఆడిన డెంకాడ మండలం రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కుర్మాన భాను గురువారం డీఈఓను కలిశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు బ్రహ్మాజీ, వాసుదేవరావు, ప్రధానోపాధ్యాయులు కె.సౌభాగ్యలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాస్



పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్ పతివాడ శ్రీనివాసరావు

విజయనగరం: అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 2వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో జరగనున్న 35వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టుకు కోచ్‌గా విజయనగరం హెడ్‌పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్న కబడ్డీ క్రీడాకారుడు పతివాడ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ సర్కిల్ ఆఫీస్ నుంచి గురువారం నియామక ఉత్తర్వులు వచ్చాయి. సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పతివాడ శ్రీనివాసరావు 1997 నుంచి పలు జాతీయ పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా పలుమార్లు వ్యవహరించారు. శ్రీనివాసరావు నియామకం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్ కౌశిక్, సూరిబాబు, కబడ్డీ గురువు బొమ్మన రామారావు, తపాలా శాఖ సిబ్బంది, కబడ్డీ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

చెరువులో పడి దివ్యాంగుడి మృతి

భోగాపురం: మండల కేంద్రంలోని నెయ్యిల వీధికి చెందిన దివ్యాంగుడు ఆవల రమణ (35) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. దీనిపై మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుట్టుకతోనే దివ్యాంగుడైన రమణ చిన్న చిన్న కూలిపనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య కనకతో పాటు తండ్రి నర్సింగరావు ఉన్నారు. బుధవారం సాయంత్రం బహిర్భూమికని రమణ ఇంటి నుంచి వెళ్లాడు. చీకటి పడుతున్నా ఎంతకీ రాకపోవడంతో బంధువులతో కలిసి తండ్రి, భార్య చుట్టుపక్కల ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది. గురువారం ఉదయం పంచాయతీ వెనుక ఉన్న చెరువులో రమణ మృతదేహం తేలియాడింది. స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఆటో బోల్తాపడి గాయపడిన మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఎరుసు రాము(60) తగరపువలసలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాము ఆటో నడుపుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రోజుమాదిరిగా ఈనెల 20వ తేదీన ఆటో వేసుకుని భోగాపురం స్టాండ్‌కు బయల్దేరాడు. తిరిగి పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి వస్తుండగా జగ్గయ్యపేటకు చేరుకునేసరికి ముందువెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో స్థానికులు ఆటోను పైకి లేపి చేసి తీవ్ర గాయాలపాలైన రామును గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తగరపువలస ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మృతుడి భార్య తోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు.